# శివరావు కోట

శివరావు గొప్ప మేధావి. అతను సైకోఫిజిక్స్, సైకోడైనమిక్స్‌లలో చేసిన పరిశోధనలవలన ప్రపంచశాస్త్రజ్ఞుల దృష్టి నాకర్షించాడు చిన్నవయసులోనే. అతను ఇప్పుడు 'మానవ అనుభవాన్ని నిత్యసత్యంగా మార్చడం ఎలా?' అన్న విషయం మీద పనిచేస్తున్నాడు.

దైనందిన జీవితంలో మనిషి ఎన్నో అనుభవాలకు లోనవుతున్నాడు. అందులో చాలాభాగం అర్థంలేనివీ, వ్యర్థమైనవీని. కొన్నిటిని అనుభవిస్తున్నట్లు అతనికే తెలియదు. కొన్నిటిని నెమరువేసి, సాగదీసి అనుభవిస్తాడు. కాని ఒక్కటీ కూడా అతనికి మిగలటం లేదు. రుచికరమైన పదార్థాలెన్నో తింటాడు. రుచి అన్న అనుభవం ఎక్కడకు పోతుందో మరి, ఆ క్రియతోటీ అదీ మాయమైపోతుంది. వాసన, సుఖము, భోగము, నవ్వు, ఏడుపు అన్నీ ఏమైపోతున్నవో! చాలా కొద్దిభాగం కొంతకాలంవరకూ జ్ఞాపకాలుగా నిలిచినా తరువాతైనా జారిపోతాయి... తాను కోరుకున్న కొన్ని ముఖ్యమైన అనుభవాల్ని శాశ్వతం చేసుకుంటే మానవజీవితానికి పరిపూర్ణత వస్తుంది. ఆ ప్రక్రియ కనిపెడితేగాని మానవ జాతికి నిజమైన మనుగడ వుండదు. దాని కోసమే శివరావు ప్రయత్నం... బృహత్‌యత్నం!

శివరావుకు తన పరిశోధనలమీద తప్ప మిగతా ప్రపంచంలో ఆసక్తి లేదు. అనురాగాలు, అనుబంధాలు మొదలైన భావనలు అశాస్త్రీయములని నిర్లక్ష్యం. కాని ఈ మధ్యనే జీవితం విసిరే ఉచ్చులో చిక్కుకున్నాడు. గౌరి అనే అమ్మాయి అతన్ని బలంగా ఆకర్షిస్తోంది. ఇది యౌవనసహజమైన కామవాంఛయొక్క గ్రుడ్డిరూపాంతరమేనని తను అనుమానించినా , ఇంకా ఒక నిర్ధారణకు రాలేదు.

గౌరి ఎక్కువ ఆలోచనాపటిమగల వ్యక్తి కాదు. శాస్త్రీయమైన ఆలోచనాధోరణి ఆ పిల్లకు లేదు. పైగా శివరావు పరిశోధనలతోపాటుగా మానవప్రయత్నాలన్నిటినీ అపహాస్యం చేస్తున్నట్లు మాట్లాడుతుంది. "ఆకాశంలో స్పష్టంగా కనిపించే నక్షత్రాల సంగతలావుంచండి: కనిపించీ కనిపించని నక్షత్రాలుంటాయే అవి నేరుగా శ్రద్ధగా పరీక్షగా

చూస్తే అసలు కనిపించవు. ప్రక్కగా ఎటో చూస్తున్నపుడు మరింత కాంతితో ప్రత్యక్షమౌతాయి.

"ఏదైనా విషయం గుర్తుకు తెచ్చుకోవాలనుకుంటే ఎంత ప్రయత్నించినా గుర్తుకురాదు. ఆ ప్రయత్నం ఒదిలేసి వేరే పనిలో వున్నప్పుడు గబుక్కున గుర్తుకు వస్తుంది"

"ప్రపంచగతినే ప్రభావితం చేసిన ఎన్నో పరిశోధనలు ఇలాగే ప్రయత్నం విరమించాక సిద్ధించినవే. కాబట్టి మీరు యింత తీవ్రంగా ఆలోచించకుండా ఒదిలెయ్యండి. సమాధానం వస్తుంది" అని నవ్వుతుంది. ఎప్పుడూ నవ్వుతూ గలగలపారే సెలయేరులాగా వుంటుంది గౌరి. ఆ నవ్వు శివరావుని అతి విలువైన పనిలోనుంచీ కళ్ళెం వేసి లాక్కొస్తున్నది.

శివరావుకి 'ఎదురుచూడ్డం' అంటే సరిపడదు. అతనికి కాలం విలువైనది. కాని ఇవాళ గౌరికోసం ఎదురుచూస్తున్నాడు. ఊరిబయట తోటపక్కనే గుట్టలుండే విశాలమైన బయలు అది. గౌరికి యిలాంటి చోటులంటే యిష్టం. అందుకే ఇక్కడికి రమ్మన్నది. కాని చెప్పిన ప్రకారం ఆ పిల్ల రాలేదు. 'చెప్పిన ప్రకారం చేయకపోవటమే గౌరి లక్షణం' అని నవ్వుకున్నాడు. గౌరి జ్ఞాపకాల తియ్యనిమత్తులో గడ్డిమీద వెల్లకిలా పడుకున్నాడు. పనిలేక పోవడాన్నో, పరిశ్రమ తర్వాతి అలసటవలననో క్రమంగా నిస్సత్తువలోకి, మగతలోకి జారిపోయాడు.

అప్పుడు ఈ విచిత్రం జరిగింది. పడుకున్న అతని నోట్లోంచీ అప్రయత్నంగా 'సాధ్యం' అన్నమాట బయటికి వచ్చింది. ఆ మాట అతని కళ్ళముందే ఘనీభవించి రాయిగా రూపొందింది. కలా? నిజమా? అనుకున్నాడు. ఎదురుగా రాయి వున్నది... గట్టిగా, నిజంగా. మట్టిరంగులో తేలిగ్గా, పారదర్శకమైన దీర్ఘ ఘనం. దాన్ని చూడగానే ఏదైనా సాధ్యమేనని తెలిసిపోతున్నది. సందేహానికి తావులేదు. కాని అతనికి భయం వేసింది. కొంతసేపటికి తేరుకున్నాడు. 'సుఖం' అన్నాడు. ఆ మాటకూడా ఘనీభవించింది. ఈసారి భయం వెయ్యలేదు. దాన్ని పట్టుకుని చూచాడు. ఎంతో సుఖమనిపించింది. గట్టిగా, పచ్చగా, నిజంగా, కాంతి నిరోధకమైన దీర్ఘఘనం. ఈసారి అతనికి సరదాపుట్టింది. 'చలి' అన్నాడు. బూడిదరంగు రాయి ఏర్పడింది. 'మంచితనం' తెల్లగా, తేలిగ్గా, కాంతినిరోధకంగా వున్నది. సరదాగా చాలారాళ్ళు చేశాడు. అందమైన రాళ్ళ కుప్ప ఏర్పడ్డది.

తాను చేస్తున్న పని విషయంలో అతనికింకా సందేహం పోలేదు. ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూశాడు. దూరాన పచ్చని చెట్టు. దాని కింద ముసలివాడు. అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లున్నాడు. ఒక్కోసారి అస్థిపంజరం మాదిరిగానూ

కనిపిస్తున్నాడు. శివరావునే చూస్తున్నాడు. ఆ చూపులో ఏ భావమూ లేదు. తాను చేస్తున్న పనికి నవ్వినా, తిట్టినా, ఎగతాళిచేసినా శివరావుకి అర్థం అయేదే. కాని ఈ భావరహితమైన చూపు అతనికి సరిపడలేదు. కాని ఏమీచెయ్యలేక తలతిప్పి రాళ్ళగుట్టను పరిశీలిస్తూ కూర్చున్నాడు. చూడగా, చూడగా రాళ్ళన్నీ ఒకేమాదిరిగా అర్థరహితంగా కనిపించసాగాయి. 'ఈ ముసలాడు నా మూడ్ పాడుచేశాడు' అని విసుక్కున్నాడు.

ఆ రాళ్ళన్నీ కూర్చి అర్థవంతమైన ఆకారం యిస్తే ఎట్లుంటుందోనన్న ఆలోచన వచ్చింది. ఒకదానిమీదనొకటి పేర్చాడు. చక్కగా అతుక్కుపోయాయి. ముసలివానికీ తనకీ మధ్యన గోడలా కడుతూ పోయాడు. కొంతసేపు కట్టి ఒక చివరకుపోయి తొంగిచూశాడు. ముసలివాడు అలానే చూస్తున్నాడు. శివరావుకి చాలా కోపం వచ్చింది. అర్థం లేకపోవడాన్ని శివరావు సహించలేకపోతున్నాడు. 'ఆ చూపును భరించాల్సిన అవసరం నాకు లేదు' అనుకున్నాడు. తనచుట్టూ అనుభవాల రాతికోట కట్టి ఆ ముసలాడు... ఆ అర్థరాహిత్యం... ఎప్పటికీ కనపడకుండా చేసుకోగలడు!

రకరకాల అనుభవాలు యిటుకలు చేస్తూ చిత్రవిచిత్రాలుగా పేరుస్తూ కోట కడుతూ పోతున్నాడు శివరావు. బాహ్యప్రపంచాన్ని మరపించేటంతటి ఆసక్తిపుట్టింది పనిలో. చుట్టూ గోడలు పైకి లేచినై.

గౌరి ఇప్పటికైనా వస్తున్నదేమోనని గోడపైకి ఎక్కిచూశాడు. గౌరి రావటంలేదుగాని ముసలాడు అట్లాగే చూస్తూవున్నాడు. ఈసారి శివరావుకి చాలా కోపం వచ్చింది. 'ఈ అస్థిపంజరాన్ని చూడకూడదు' అనుకుని కోటపైనంతా శుద్ధంగా మూసేశాడు. అందమైన కోటలో కూర్చున్నాడు. ఇహనుండీ బయటి క్షుద్రప్రపంచంతో సంబంధం లేకుండా తన పరిశోధనలు తాను చేసుకుంటూ హాయిగా వుండొచ్చు తన సొంత కోటలో! అనుకున్నాడు.

వాకిలిగా వదలిన సందులోనుంచి గౌరి కనిపించింది. గబగబా నడిచివస్తోంది. తన ఆలస్యానికి క్షమాపణలు చెప్పుకుంటున్నట్లుగా వేగంగా వస్తోంది.

గౌరిని చూస్తున్న శివరావు కళ్ళకి గౌరి వెనుగ్గా చెట్టుక్రింది ముసలాడు కనిపించాడు. ఇద్దరూ ఒకటిగా కనిపించారు. తల విదిలించుకున్నా భ్రాంతి ఒదల్లేదు.

అప్పుడు శివరావుకి అనుమానం వచ్చింది. ఈ గౌరి కోటలోకి ఒస్తుందా? ఆ చెట్టుకింద ముసలాడిదగ్గర హాయిగా వుందామంటుందా!

శివరావులో గౌరి వస్తున్నదన్న సంతోషం పోయింది. ఇప్పుడు గౌరి అతనికళ్ళకు అనంతమైన అజ్ఞానానికి ప్రతినిధిలాగా ఉబ్బుగా కనిపించింది. మానవజాతి పోరాడి గెలవ్వలసిన చీకటిమూర్తిలాగా నల్లగా కనిపించింది. వంకరటింకరగా నడుస్తూ

కనిపించింది.

ఇటువంటి మనిషి మీద నాకు ఇంత ఆకర్షణ ఎట్లా కలిగిందని ఆశ్చర్యపోయాడు శివరావు. ఆలోచించినకొద్దీ అతని ఆశ్చర్యం అసహ్యంగా మారింది. గౌరిమీద అసహ్యం, తన మీద అసహ్యం. ప్రేమ మీద అసహ్యం... తాను పెద్ద మేధావి. ప్రపంచస్థాయి కీర్తి సంపాదించబోతున్నాడు. ఈ పల్లెపిల్ల వలలో ఎట్లా చిక్కుబడ్డాడు. ఆహా! ఎంత నెరజాణ లుంటారు ఈ పల్లెసీమల్లో. నేనా వీళ్ళ వలలో చిక్కే అమాయకుణ్ణి! అని నవ్వుకున్నాడు.

ఇహ ఆ గౌరి లోపలకు రాకూడదు. ఆ వాకిలికూడా మూసేస్తేనే గాని తనకు శాంతి లేదు. ఇంతవరకూ రాతిగా మార్చని ఒక్కమాట కోసం, ఒక్కభావంకోసం తన అంతరాంతరాల్లో గాలించాడు. 'ప్రేమ' అన్నాడు. వెంటనే ఆమాట బయటకు వచ్చి ఘనీభవిస్తుండగానే విరిగి, విసుగు, కోపం, భయం, అసహ్యం అయి వాకిట్లో కుప్పబడిపోయింది. ఇప్పుడు వాకిలే లేదు!

అసలు వాకిలితో... ప్రపంచంతో... పనిలేదు! కోటలో శివరావు సంతోషంగా వున్నాడు. అనుభవాల్ని నిత్యసత్యంగా మార్చే ప్రక్రియ అతనికి తెలిసిపోయింది. ఎంత శ్రమకు ఫలితం ఇది. తన అనుభవాలన్నీ శిలాశాశ్వతాలైపోయాయి. తనకు పూర్ణత్వం సిద్ధించింది. ఇది కేవలం తన కోట!

కొంతసేపటికి అతనికి ఊపిరాడనట్లు, ఉక్కిరిబిక్కిరౌతున్నట్లు శరీరం బిగుసుకుపోతున్నట్లు అనిపించింది.

గాలి... గాలి... ప్రాణవాయువు లేదు!

క్షణక్షణానికీ అతని శక్తి క్షీణించిపోతున్నది. క్రిందపడిపోయాడు శివరావు.

గుట్టమీద వున్న మనిషి ఎప్పట్నుంచో శివరావు వింతచేష్టల్ని గమనిస్తున్నాడు. ఆలోచనలోపడ్డట్లు, చేతిలో ఏమోవున్నట్లు ఏదో పనిచేస్తున్నట్లు శివరావు చేస్తున్న చేష్టల్ని చోద్యంగా చూశాడు. ఇంతలోనే శివరావు పడిపోయాడు. అతను గుట్ట దిగి శివరావు దగ్గరకెళ్ళి చూశాడు. శ్వాస నిలిచిపోయింది...

'ఉత్తినే యిట్లా చచ్చాడేమిటి?' అనుకుంటూ నిలబడిపోయాడతను.

★★★